సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

ఆదివారం । 30 । అక్టోబర్ । 2022



భక్తిశ్రద్ధలతో నాగుల చవితి

నాగుల చవితి పండగను శనివారం జిల్లా వ్యాప్తంగా భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. వేకువజామున కుటుంబ సమేతంగా పుట్టల వద్దకు వెళ్లి పూజలు చేశారు.



పోలీసుల తీరుపై నిరసన

- పోలీసుస్టేషన్ ఎదుట వైఎస్సార్‌సీపీ శ్రేణుల బైఠాయింపు
- చర్యలు తీసుకోవాలని డిమాండ్

8లో

న్యూస్‌రీల్

తీర్థయాత్రలకు ఆర్టీసీ సర్వీసులు ప్రారంభం



తీర్థయాత్రలకు ఏర్పాటుచేసిన ఆర్టీసీ సర్వీసు

అడ్డతీగల: కార్తీకమాసం సందర్భంగా ఉత్తరాంధ్ర తీర్థయాత్రల పేరిట ఏలేశ్వరం ఆర్టీసీ డిపోకు చెందిన అధికారులు రెండు బస్సు సరీ్వసులను అందుబాటులోకి తెచ్చారు. వీటిని శనివారం అడ్డతీగలలో ప్రారంభించారు. శ్రీకాకుళం జిల్లాలోని అరసవిల్లి, శ్రీ కూర్మం, శ్రీ ముఖలింగం, విజయనగరం జిల్లా రామతీర్థం, విశాఖ జిల్లాలో సింహాచలం, అనకాపల్లి జిల్లా ఉపమాక, కాకినాడ జిల్లా అన్నవరం వీర వెంకట సత్యనారాయణస్వామి దేవస్థానాన్ని భక్తులు సందర్శిస్తారని ఆర్టీసీ అధికారులు తెలిపారు. ఒకొక్కరికి టికెట్ ధర రూ.1250 నిర్ణయించారు.

జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోండి

- పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి



సాక్షి, పాడేరు : కొయ్యూరు మండలం శరభన్నపాలెంలో ఈ నెల 31న నిర్వహించే మినీ జాబ్‌మేళాను గిరిజన అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి కోరారు. ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మోహన్ స్పిన్‌టెక్స్, సెంట్రల్ ఫార్మసీ, మదర్ అండ్ ఫాదర్ సర్వీసెస్‌లు తమ కంపెనీల్లో పోస్టులు భర్తీ చేయనున్నాయని ఎమ్మెల్యే తెలిపారు. ఐదు నుంచి 10వ తరగతి, ఇంటర్, డిప్లమో, ఏఎన్‌ఎం, ఎంపీహెచ్‌డబ్ల్యూ, జీఎన్‌ఎం, బీఎస్సీ నర్సింగ్ విద్యార్హతలు ఉన్న 18 నుంచి 35ఏళ్ల యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

సీఆర్‌పీఎఫ్ ఆధ్వర్యంలో ఫిట్ ఇండియా



సైకిల్ ర్యాలీని ప్రారంభిస్తున్న సీఆర్‌పీఎఫ్ బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్

వై.రామవరం: స్థానిక పోలీసుస్టేషన్ సీఆర్‌పీఎఫ్ డి42 బెటాలియన్ పోలీసుల ఆధ్వర్యంలో శనివారం ఫిట్ ఇండియా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ నెల 31న సర్దార్ వల్లభాయి పటేల్ జయంతి పురస్కరించుకుని బెటాలియన్ ఇన్‌స్పెక్టర్ వెంకటరమణ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమాన్ని అసిస్టెంటు కమాండెంటు ఎంఎల్ నాయుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా బెటాలియన్ సిబ్బంది గ్రామంలో సైకిల్ ర్యాలీ నిర్వహించారు.

మెరుగైన విద్య బోధించాలి

రంపచోడవరం: ఆశ్రమ పాఠశాలల్లో గిరిజన విద్యార్థులకు మెరుగైన విద్యా బోధన చేయాలని గిరిజన సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ సీహెచ్ శ్రీనివాసరావు సూచించారు. రంపచోడవరంలోని వసతిగృహంలో శుక్రవారం రాత్రి ఆయన రాత్రి బస చేశారు. విద్యార్థులకు మెనూ ప్రకారం ఆహార పదార్థాలు అందించాలన్నారు. ఆశ్రమ పాఠశాలల్లో విద్యా బోధన, మెనూ అమలు తదితర అంశాల పరిశీలన నిమిత్తం ఏజెన్సీలోని ఆశ్రమ పాఠశాలల్లో రాత్రి బస నిర్వహిస్తున్నామని చెప్పారు.

ప్రకృతి అందాలకు ఫిదా



వంజంగి హిల్స్‌లో మంచు అందాలను వీక్షిస్తున్న పర్యాటకులు



పర్యాటకులతో రద్దీగా అరకు రైల్వేస్టేషన్

పోటెత్తిన పర్యాటకులు

ఎక్కడ చూసినా సందడే సందడి

సాక్షి, పాడేరు: జిల్లా వ్యాప్తంగా పర్యాటక ప్రాంతాలకు శనివారం పర్యాటకులు పోటెత్తారు. మన్యమంతా పొగమంచు దట్టంగా కురుస్తుండడంతో పర్యాటకుల రాక ప్రారంభమైంది. వీకెండ్ కావడంతో శనివారం ఉదయం నుంచి పర్యాటకులు భారీగా మన్యానికి చేరుకున్నారు. రంపచోడవరం, మారేడుమిల్లి, అరకులోయ, అనంతగిరి, పాడేరు, లంబసింగి, మోతుగూడెం ప్రాంతాలలో శుక్రవారం రాత్రి నుంచే పర్యాటకుల సందడి నెలకొంది.ఇక్కడ పర్యాటక, ప్రైవేట్ రిసార్టులు, లాడ్జీలు, కాటేజీలు పర్యాటకులతో నిండిపోయాయి. శనివారం తెల్లవారు జాము మూడు గంటలకు టోల్‌గేట్ తెరిచి వంజంగి హిల్స్ పైకి పర్యాటకులను అనుమతించారు. అత్యంత ఎత్తులో ఉన్న భోనంగమ్మ కొండకు పర్యాటకులు కాలినడకన చేరుకున్నారు. సూర్యోదయం, మంచు అందాలను వీక్షించారు. ఉదయం పది గంటల వరకు వంజంగి హిల్స్‌లో పర్యాటకులు సందడి చేశారు.ఆంధ్రా ఊటీగా పేరొందిన అరకులోయకు రైలు మార్గంలోను పర్యాటకులు భారీగా తరలివచ్చారు. విశాఖ నుంచి కిరండోల్ రైలులోని అన్ని బోగీలతో పాటు, విస్టోడమ్ కోచ్ నిండిపోయింది. బొర్రాగుహలు,అరకులోయ రైల్వే స్టేషన్లు పర్యాటకులతో కిటకిటలాడాయి. అనంతగిరి మండలంలోని బొర్రా గుహలు, కటిక, తాడిగుడ జలపాతాలు, డముకు, గాలికొండ వ్యూపాయింట్, సుంకరమెట్ట కాఫీతోటలు, సుంకరమెట్ట పురాతన చర్చిని పర్యాటకులు సందర్శించారు. అరకు పద్మాపురం గార్డెన్, గిరిజన మ్యూజియం.రణజిల్లెడ, చాపరాయి జలపాతాలు, హుకుంపేట మండలంలోని మత్స్యగుండం, పాడేరు ఘాట్‌లోని మోదకొండమ్మ తల్లి పాదాలు గుడి, డల్లాపల్లి కొండలు, మినుములూరు కాఫీతోటలు, కొత్తపల్లి జలపాతం, చెరువుల వేనం, లంబసింగి, తాజంగి పర్యాటక ప్రాంతాలను పర్యాటకులు వీక్షించారు. ఆంధ్రా–ఒడిశా ప్రభుత్వాలు సంయుక్తంగా నిర్వహిస్తున్న మాచ్‌ఖండ్ పవర్ ప్రాజెక్టు, జోలాపుట్టు, డుడుమ, సీలేరు, మోతుగూడెం డ్యామ్‌లను పర్యాటకులు సందర్శించారు.

కొత్తపల్లి జలపాతం వద్ద..

జి.మాడుగుల: కొత్తపల్లి జలపాతానికి దూరప్రాంతాల నుంచి పర్యాటకులు భారీగా తరలివచ్చారు. ఆంధ్రా, ఒడిశా, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన పర్యాటకులు ప్రత్యేక వాహనాల్లో రావడంతో సందడి నెలకొంది. జలపాతంలో స్నానాలు చేస్తూ ఉల్లాసంగా గడిపారు. వ్యూపాయింట్ వద్ద సెల్ఫీలు, ఫొటోలు దిగారు.



కొత్తపల్లి జలపాతం వద్ద సందడి చేస్తున్న పర్యాటకులు

రాజవొమ్మంగి: మంచు అందాలు కనువిందు చేస్తున్నాయి. వేకువజామున మంచు తెరలను చీల్చుకుంటూ ఉదయిస్తున్న భానుడు ప్రకృతి ప్రేమికులను కట్టిపడేస్తున్నాడు. రాజవొమ్మంగి ప్రాంతంలో ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పడుతున్నాయి.



రాజవొమ్మంగిలో కనువిందు చేసిన భానుడు

మంజూరైన ఇళ్లకు జియో ట్యాగింగ్ తప్పనిసరి



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న పీవో సూరజ్ గనోరే

ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే

రంపచోడవరం: ఏజెన్సీలో గిరిజనులకు మంజూరైన ఇళ్లకు జియోట్యాగింగ్ తప్పనిసరి అని రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే ఆదేశించారు. స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరంలో శనివారం ఎంపీడీవోలు, గృహనిర్మాణ శాఖ ఇంజనీర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్సులో ఆయన మాట్లాడారు. లబ్ధిదారులకు బ్యాంక్ అకౌంట్ తప్పనిసరిగా ఉండాలన్నారు. ఇళ్లు మంజూరైన గ్రామాల్లో ఈ నెల 31న నుంచి నవంబర్ 7వ తేదీ వరకు గ్రౌడింగ్ మేళాలు నిర్వహిస్తామన్నారు. ఏజెన్సీ ఏడు మండలాల్లో 2,392 గృహాలు మంజూరైనట్లు తెలిపారు. గృహ లబ్ధిదారులకు ఇళ్ల నిర్మాణానికి ఒకొక్కరికి ఒక్కొక్కరికి రూ. ఐదు వేల నగదు వారి ఖాతాల్లో జమచేస్తామన్నారు. లబ్ధిదారులు స్వయంగా ఇళ్లు నిర్మించుకోవాలని ఆయన సూచించారు. గృహాలకు రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా ఉండాలన్నారు. పాఠశాలలకు నాడు–నేడులో మంజూరైన పనులకు తప్పనిసరిగా ఎంబుక్‌న మోదు చేసి అప్‌లోడ్ చేయాలన్నారు. నాడు–నేడుకు ఖర్చు చేసిన నిధులపై ఆయన సమీక్షించారు. ఈ సమావేశంలో ఈఈ బీ రంగనాథ్, ఏఈ భీమశంకర్‌రెడ్డి, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

దివ్యాంగులకు పింఛను అందేలా చర్యలు



మాట్లాడుతున్న ఏఎస్పీ ప్రతాప్ కిశోర్

చింతపల్లిరూరల్: అర్హులైన దివ్యాంగులకు ప్రభుత్వ పింఛన్ అందించడమే లక్ష్యంగా ప్రత్యేక చర్యలు చేపడుతున్నమని ఏఎస్పీ ప్రతాప్ కిశోర్ తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎస్పీ సతీష్‌కుమార్ ఆదేశాల మేరకు సీతు అనే కార్యక్రమాన్ని మారుమూల గిరిజన గ్రామాల్లో నిర్వహిస్తుని చెప్పారు. చాలా గ్రామాల్లో దివ్యాంగులకు గుర్తింపు పత్రాలు లేక ప్రభుత్వం అందిస్తున్న పింఛను నోచుకోలేకపోతుండటం తమ దృష్టికి వచ్చిందన్నారు. ఈ విషయాన్ని కలెక్టర్ సుమిత్ కుమార్, ఎస్పీ సతీష్‌కుమార్ దృష్టికి తీసుకువెళ్లామన్నారు. దీంతో వచ్చే నెల 4,5 తేదీలో సదరం శిబిరం నిర్వహించేందుకు ఆదేశాలు జారీ చేశారన్నారు. వివరాలకు 9440904238 నంబరులో సంప్రదించాలని ఏఎస్పీ కోరారు.

మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి పనులు వేగవంతం

రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే

రంపచోడవరం: మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణ పనులను వేగవంతం చేయాలని రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే ఆదేశించారు. స్థానిక ఏరియా ఆస్పత్రి సమీపంలో జరుగుతున్న పనులను శనివారం ఆయన పరిశీలించారు. నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. అనంతరం ముసురుమిల్లి బాలుర ఆశ్రమ పాఠశాలలను సందర్శించారు. స్టోర్ రూమ్‌ను పరిశీలించారు. కాంట్రాక్టర్ కూరగాయల సరఫరా వివరాలను వార్డెన్, హెచ్‌ఎంల నుంచి తెలుసుకున్నారు. తాజా కూరగాయాలు సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. జీసీసీ ద్వారా సరఫరా చేసే పెసర పప్పు, తదితర నిత్యావసర సరకులను తనిఖీ చేశారు.



రంపచోడవరంలో సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణాన్ని పరిశీలిస్తున్న పీవో సూరజ్ గనోరే

చలిగాలుల విజృంభణ



పాడేరులో కురుస్తున్న మంచు



పాడేరులో చలిమంట కాగుతున్న వృద్ధుడు

- ఉదయం 10 గంటల వరకు మంచు తెరలు
- మినుములూరులో 12..
- అరకులోయలో 14.6..
- చింతపల్లిలో 15.5 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత నమోదు

సాక్షి, పాడేరు: ఏజెన్సీలో కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతుండటంతో చలి గాలులు విజృంభిస్తున్నాయి. మినుములూరు కేంద్ర కాఫీబోర్డు వద్ద 12 డిగ్రీలు, అరకులోయ కేంద్ర కాఫీబోర్డు వద్ద 14.6 డిగ్రీలు, చింతపల్లి వ్యవసాయ పరిశోధన స్థానంలో 15.5 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు శనివారం నమోదయ్యాయి. సాయంత్రం నాలుగు గంటల నుంచి చలి గాలుల ప్రభావం నెలకొంది. అర్ధరాత్రి నుంచే పొగమంచు దట్టంగా కురుస్తోంది. మన్యంలోని ప్రధాన రోడ్లు, ఘాట్ ప్రాంతాల్లో పొగమంచు కారణంగా వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. లైట్లు వేసుకుని వాహనాలు నడుపుతున్నప్పటికీ ఎదురెదురుగా వాహనాలు కనిపించనంతగా పొగమంచు దట్టంగా కురుస్తోంది. శనివారం ఉదయం 10గంటల వరకు మంచు తెరలు వీడలేదు. పొగమంచుతో వ్యవసాయ, కూలిపనులు, వారపుసంతలకు వెళ్లే గిరిజనులు మరింత ఇబ్బంది పడుతున్నారు.చలిమంటలను ఆశ్రయిస్తున్నారు. ఉన్ని దుస్తులను వినియోగిస్తున్నారు.

గెస్ట్ టీచర్ పోస్టుల భర్తీకి ఒకటి నుంచి డెమో

- 366 మంది అభ్యర్థులకు అర్హత
- కలెక్టర్ సుమిత్ కుమార్

పాడేరు రూరల్ : జిల్లాలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న అతిథి ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి ధ్రువీకరణ పత్రాల పరిశీలన పూర్తయిందని కలెక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు. డెమోకు 366 మంది అభ్యర్థులు అర్హత సాధించారని ఆయన వివరించారు. వీరికి వచ్చే నెల ఒకటో తేదీ నుంచి మూడవ తేదీ వరకు డెమో నిర్వహించి పోస్టులు భర్తీ చేస్తామని పేర్కొన్నారు. నవంబర్ ఒకటిన పీజీటీ అన్ని కేటగిరిలతో పాటు టీజీటీ తెలుగు, ఆంగ్లం, రెండో తేదీన టీజీటీ ఆంగ్లం, లెక్కలు, సైన్సు, సోషల్ సబ్జెక్టులకు, మూడో తేదీన మిగిలిన వారికి డెమో నిర్వహిస్తామన్నారు. అర్హులైన అభ్యర్థులకు ఫోన్ ద్వారా సమాచారం అందించామని పేర్కొన్నారు. డెమోకు అర్హత సాధించిన అభ్యర్థుల జాబితాను వెబ్‌సైట్‌లో కూడా పొందుపర్చామని చెప్పారు. ఈ మేరకు వారు ఆయా తేదీల్లో హాజరు కావాలని ఆయన కోరారు.

పట్టభద్రుల ఓటు నమోదుకు 7 వరకు గడువు

- డీఆర్వో దయానిధి

పాడేరు రూరల్ : ఉత్తరాంధ్ర పట్టభద్రుల శాసన మండలి ఓటు నమోదుకు నవంబర్ 7వరకు గడువు ఉన్నట్లు జిల్లా రెవెన్యూ దయానిధి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఏడాది నవంబర్ ఒకటవ తేదీ నాటికి డిగ్రీ ఉత్తీర్ణులై మూడేళ్లు పూర్తి చేసుకున్న వారంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. గడువు తేదీ సమీపిస్తున్నందుకు త్వరగా ఓటు నమోదు చేసుకోవాలని సూచించారు. అర్హులంతా ఎన్నికల కమిషన్ నిర్దేశించిన ఫారం 18ను పూర్తి చేసి పాస్‌పోర్ట్ సైజు ఫొటో అతికించి డిగ్రీ పాసైన ధ్రువీకరణ పత్రం జెరాక్స్ కాపీ జోడించి నివాస ఆధారంగా సంబంధిత మండల కార్యాలయాల్లో అందజేయాలన్నారు. ఫారం –18లో శాసనసభ ఎన్నికల ఓటరు జాబితాలో ఉన్న దరఖాస్తుదారుని వివరాలను పొందుపరచాలని సూచించారు. ఓటు నమోదు అధికారికి అందజేసిన తర్వాత తప్పనిసరిగా రశీదు పొందాలని సూచించారు. ఓటు నమోదు ఆన్‌లైన్‌లో కూడా చేసుకోవచ్చన్నారు.

అభివృద్ధి పనులపై కలెక్టర్‌తో చర్చ



కలెక్టర్ సుమిత్‌కుమార్‌తో చర్చిస్తున్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

అనంతగిరి: అరకు నియోజకవర్గంలోని నిధులు మంజూరైన అభివృద్ధి పనులపై శనివారం పాడేరు కలెక్టరేట్‌లో కలెక్టర్ సుమిత్‌కుమార్‌తో అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ చర్చించారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంతోపాటు పెండింగ్ ప్రాజెక్టులకు సంబంధించి మంజూరైన నిధులతో పనులు వేగవంతం అయ్యేలే కృషి చేయాలని ఆయన కోరారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే కోటా కింద మంజూరైన రూ.రెండు కోట్లలో 1.50 కోట్లతో రహదారులు, రూ.50 లక్షలతో తాగునీటి పథకాలకు ప్రతిపాదనలు పంపాలని కలెక్టర్ సూచించారని ఎమ్మెల్యే తెలిపారు. బొర్రాగుహల ఆదాయంలో పంచాయతీ వాటా వచ్చేలా పర్యాటకశాఖ అధికారులతో చర్చించినట్లు ఆయన పేర్కొన్నారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో ఎమ్మెల్యే వెంట ఎంపీపీ శెట్టి నీలవేణి, కోఆప్షన్ సభ్యుడు మదీనా పాల్గొన్నారు.

అమ్మ లేదని ఆగిన గుండె

- తల్లి మరణంతో తల్లడిల్లిన కొడుకు
- ఒక్కరోజు వ్యవధిలోనే ఇరువురు మృతి
- ముంచంగిపుట్టులో విషాదం



తల్లి పుష్పతో సాయికుమార్ (ఫైల్)



సాయికుమార్‌కు దహన సంస్కారాలు నిర్వహిస్తున్న బంధువులు

ముంచంగిపుట్టు: తల్లి మరణం తట్టుకోలేని ఓ కొడుకు గుండె ఆగిపోయింది. కన్నతల్లి ఇక లేదని తెలిసి తట్టుకోలేకపోయాడు. అమ్మ కోసం ఆలోచిస్తూ మనోవేదనకు గురయ్యాడు. ఆమె మృతి చెందిన ఒక్కరోజు వ్యవధిలోనే తనువు చాలించాడు. ఈ విషాద ఘటన ముంచంగిపుట్టు మండల కేంద్రంలో చోటుచేసుకుంది. ఒకే ఇంటిలో సంభవించిన తల్లీకొడుకుల హఠాన్మరణం అందర్నీ కలచివేసింది.

అనారోగ్యంతో బాధపడుతూ..

మండల కేంద్రంలోని సంతబయలులో నివాసం ఉంటున్న గంపరాయి పుష్ప (40) అనారోగ్యంతో బాధపడుతూ గురువారం రాత్రి మృతి చెందింది. శుక్రవారం ఆమెకు కుమారుడు గంపరాయి సాయికుమార్ (21) అంత్యక్రియలు నిర్వహించాడు. తల్లి లేదన్న విషయం జీర్ణించుకోలేని అతను శనివారం ఉదయం ప్రాణాలు వదిలాడు.

వెంటాడిన వరుస మరణాలు

సాయికుమార్ కుటుంబాన్ని వరుస మరణాలు వెంటాడాయి. ఎనిమిది నెలల క్రితం తండ్రి కృష్ణ అనారోగ్యంతో మృతి చెందగా, తొమ్మిదేళ్ల క్రితం రోడ్డు ప్రమాదంలో సాయికుమార్ అన్నయ్య వినోద్‌కుమార్ చనిపోయాడు. కుటుంబంలో తల్లి, తండ్రి, ఇద్దరు సోదరులు చనిపోవడంతో సోదరి ప్రియాంక అనాథగా మిగిలిపోయింది. ఆమె రోదనను చూసి అక్కడి వచ్చిన వారి హృదయాలు బరువెక్కాయి. ఆమెను ప్రభుత్వం ఆదుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

క్లుప్తంగా

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన



రైతులకు అవగాహన కల్పిస్తున్న కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ రాజశేఖర్

వై.రామవరం: మండలంలో చామగడ్డ గ్రామ సచివాలయం పరిధిలోని దద్దిలికివాడ గ్రామంలో శనివారం పందిరిమామిడి కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే) ఆధ్వర్యంలో రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ రాజశేఖర్ ప్రకృతి సాగు వల్ల కలిగే ప్రయోజనాలను వివరించి, సేంద్రియ ఎరువుల తయారీపై శిక్షణ ఇచ్చారు. జీవామృతం తయారు చేసి చూపించారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ రసాయన ఎరువులకు బదులుగా సేంద్రియ ఎరువులను వినియోగించాలని సూచించారు. అనంతరం కృషి విజ్ఞాన కేంద్రం ద్వారా విత్తనాలు పంపిణీ చేశారు. సేంద్రియ ఎరువులతో పండిస్తున్న చోడి(రాగి) పంటను పరిశీలించారు. సర్పంచ్ కృష్ణారెడ్డి, అగ్రికల్చర్ అసిస్టెంటు నవీన్, సచివాలయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

చోరీలపై కేసులు నమోదు

వై.రామవరం: గ్రామంలో శుక్రవారం రాత్రి జరిగిన రెండు చోరీలపై శనివారం రాత్రి కేసులు నమోదు చేసినట్టు ఎస్ఐ ఎం.సంతోష్ కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు.. శుక్రవారం రాత్రి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిద్రిస్తున్న విద్యార్థుల నుంచి రెండు సెల్‌ఫోన్లు దొంగతనం జరిగిందని, అలాగే మైన్‌రోడ్‌లోని మడకం రామలక్ష్మి అనే మహిళకు చెందిన ఇంట్లో జరిగిన ఘటనలో చెవిదిద్దులు, పట్టీలు కొంత నగదు దొంగతనానికి గురైనట్టు ఫిర్యాదు అందడంతో కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ చెప్పారు. ఈసందర్భంగా ఎస్ఐ సంతోష్ కుమార్ మాట్లాడుతు గ్రామాల్లో దొంగల సంచారిస్తున్నారని అప్రమత్తంగా ఉండాలన్నారు.

పోలీసుల తీరుపై నిరసన

- ఏజీ కొడేరు సర్పంచ్‌ను అన్యాయంగా అరెస్టు చేశారని ఆందోళన



పోలీసుస్టేషన్ ఎదుట ఆందోళన చేస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రజా ప్రతినిధులు, నాయకులు

చింతూరు: మండలంలోని ఏజీ కొడేరు సర్పంచ్ అగరం సుబ్బలక్ష్మిని అన్యాయంగా అరెస్టు చేశారంటూ చింతూరులో శనివారం వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు ఆందోళనకు దిగారు. పోలీసుల తీరును నిరసిస్తూ స్టేషన్ ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. ఐటీడీఏ వరకు ర్యాలీగా వెళ్లి పోలీసులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఐటీడీఏ పీవో రామశేషుకు వినతిపత్రం అందజేశారు. అనంతరం చింతూరు మెయిన్‌రోడ్డు సెంటర్ వరకు ర్యాలీగా వెళ్లి స్థానిక పోలీసుస్టేషన్ ఎదుట బైఠాయించారు. పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. వివరాలిలాఉన్నాయి. గత మార్చినెలలో ఏజీ కొడేరు పంచాయతీ ఉలుమూరులో వీధి లైట్లు అమర్చుతున్న వ్యక్తి సున్నం వెంకటకృష్ణ ప్రమాదవశాత్తూ చనిపోయాడు. దీనిపై అప్పటిలో సర్పంచ్, కార్యదర్శిపై బాధిత కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది. అయితే ప్రమాద సమాచారం తెలుసుకున్న సర్పంచ్ సుబ్బలక్ష్మి సంఘటన స్థలానికి వెళ్లారు. అక్కడ ఉన్న కొంతమంది పోద్బలంతో బాధిత కుటుంబ సభ్యులు తనపై దాడి చేశారని అప్పటిలో చింతూరు పోలీసుస్టేషన్‌లో సర్పంచ్ ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసుస్టేషన్లో కేసు నమోదైంది. ఈ నేపథ్యంలో ఏలూరు జిల్లా బుట్టాయిగూడెం బీఈడీ పరీక్ష రాసేందుకు వెళ్లిన తనను శుక్రవారం మధ్యాహ్నం 1.45 గంటలకు పరీక్ష కేంద్రం వద్ద స్థానిక పోలీసులు అరెస్టు చేశారని సర్పంచ్ తెలిపారు. అక్కడి నుంచి రంపచోడవరం పోలీసుస్టేషన్‌కు తీసుకెళ్లి రాత్రి 9 గంటలకు వైద్య పరీక్షలు నిర్వహించి 11 గంటలకు కోర్టులో హాజరు పరిచారని సర్పంచ్ తెలిపారు. బెయిల్‌పై విడుదలైన ఆమె చింతూరులో పోలీసులకు వ్యతిరేకంగా చేపట్టిన ఆందోళనలో పాల్గొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రమాదం జరిగిన స్థలంలో లేకపోయినా తనపై అన్యాయంగా హత్యకేసు నమోదు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. డీఎస్సీ నోటిఫికేషన్‌పై ఎంతో ఆశపెట్టుకున్న తనను పరీక్ష రాయకుండా అరెస్టు చేసి తన భవిష్యత్తును అంధకారం చేశారని కన్నీరుమున్నీరయ్యారు. తనపై దాడికి పాల్పడిన వారిపై ఫిర్యాదు చేసినా ఎటువంటి చర్యలు లేవని ఆరోపించారు. ఆందోళనకు ఆధ్వర్యం వహించిన కూనవరం జెడ్పీటీసీ గుజ్జా విజయ, చింతూరు ఎంపీపీ సవలం అమల, వైస్ ఎంపీపీ మేడేపల్లి సుధాకర్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ యగుమంటి రామలింగారెడ్డి మాట్లాడుతూ విలీన మండలాల్లో అధికారులు, పోలీసులు గిరిజన ప్రజా ప్రతినిధులను చిన్నచూపు చూస్తున్నారని, గ్రామాల అభివృద్ధికి తాము వారికి ఎంతగానో సహకరిస్తున్నా అక్రమ కేసులు బనాయిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. చింతూరు సీఐ అప్పలనాయుడు, ఎటపాక సీఐ గజేంద్రకుమార్ వారికి నచ్చజెప్పి ఆందోళన విరమింపజేశారు. కూనవరం ఎంపీపీ పాయం రంగమ్మ, వైస్ ఎంపీపీ యడమ అర్జున్, కూనవరం మండల కన్వీనర్ ఆలూరి కోటేశ్వరరావు, చింతూరు, కూనవరం, వీఆర్‌పురం మండలాలకు చెందిన వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు. దీనిపై సీఐ అప్పలనాయుడును వివరణ కోరగా అప్పటి సంఘటన ఆధారంగా సర్పంచ్‌పై చట్ట ప్రకారం చర్యలు తీసుకున్నామని చెప్పారు. అప్పటిలో సర్పంచ్ ఇచ్చిన ఫిర్యాదుపై విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని చెప్పారు.

సీఎఫ్ఎఫ్ఐ సభ్యులుగా గిరిజన రైతుల ఎంపికపై హర్షం



కార్యవర్గ సభ్యులుగా ఎన్నికైన కాఫీ రైతులు

పాడేరు రూరల్ : కాఫీ ఫార్మర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జాతీయ కార్యవర్గ సభ్యులుగా ఏపీ నుంచి ఇద్దరు కాఫీ రైతులు ఎన్నికయ్యారు. జాతీయ కార్యవర్గ మొదటి సమావేశాలు కేరళలోని వేనాడు జిల్లా వెళ్లముండాలో ఈనెల 26, 27 తేదీల్లో జరిగాయి. ఈ సమావేశాలకు ఆంధ్రప్రదేశ్ సహా కేరళ, తమిళనాడు.కర్ణాటక, అసోం, హర్యాణా రాష్ట్రాల నుంచి కాఫీ రైతు సంఘం నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా 25 మందితో కాఫీ ఫార్మర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. వీరిలో ఆంధ్రప్రదేశ్ నుంచి అల్లూరి జిల్లా పాడేరు మండలం మోదాపల్లి పంచాయతీ గుర్రగరువుకు చెందిన కాఫీ రైతు పాలికి లక్కు, అరుకులోయ మండలం సుంకరమెట్ట సర్పంచ్, కాఫీ రైతు గెమ్మెలి చిన్నారావులను జాతీయ కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయా రైతుల నియామకంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత



పట్టుబడిన ఇసుక ట్రాక్టర్లు

మాకవరపాలెం: అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకున్నామని ఎస్ఐ రామకృష్ణారావు తెలిపారు. మండలంలోని బూరుగుపాలెం-తూటిపాల మధ్యలో జాజిగెడ్డ నుంచి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్నట్టు అందిన సమాచారం మేరకు శనివారం రాత్రి దాడి చేసి పట్టుకున్నామన్నారు. వీటిపై కేసు నమోదు చేశామన్నారు.

వరద బాధితులకు నిత్యావసర సరకుల పంపిణీ



వరద బాధితులకు సరకులు అందజేస్తున్న దృశ్యం



వరద బాధిత కుటుంబాలకు నిత్యావసర కిట్లు అందజేస్తున్న స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు తదితరులు

వీఆర్ పురం: ఇటీవల సంభవించిన వరదలకు నష్టపోయిన బాధిత కుటుంబాలకు గివ్ ఇండియా, యాక్షన్ ఏయిడ్ సంస్థల ఆధ్వర్యంలో ఏఎస్‌డీఎస్ సంస్థ సహకారంతో 14 రకాల సరకులతో కూడిన రూ.2 వేల విలువైన కిట్లను అందజేసినట్టు ఏఎస్‌డీఎస్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ వి.గాంధీబాబు శనివారం తెలిపారు. వీఆర్ పురం మండలంలో 21 గ్రామాలు, కూనవరం మండలంలో 9 గ్రామాల్లో సుమారు మూడు వేల కిట్లను బాధిత కుటుంబాలకు అందజేసినట్టు చెప్పారు. ఈ నెల 26 నుంచి, 29వ తేదీ వరకు ఈ కార్యక్రమం కొనసాగిందన్నారు. తహసీల్దార్ ఎన్.శ్రీధర్, ఎంపీడీవో ఫణీంద్ర, ఎస్ఐ టి.దుర్గాప్రసాద్, యాక్షన్‌ఎయిడ్ సిబ్బంది ఇర్ఫాన్, వరప్రసాద్, ఫణి పాల్గొన్నారు.

కూనవరం: ఇటీవల సంభవించిన గోదావరి వరదల్లో నష్టపోయిన కుటుంబాలకు ఏఎస్‌డీఎఎస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సమకూర్చిన 14 రకాల నిత్యావసర సరకులతో పాటు దుప్పట్లు, టవళ్లను ఎంపీపీ పాయం రంగమ్మ శనివారం అందజేశారు. సంస్థ చేస్తున్న సేవలను ఆమె కొనియాడారు. సంస్థ వ్యవస్థాపకుడు ఉండవల్లి గాంధీబాబు మాట్లాడుతూ గివ్ ఇండియా, యాక్షన్ ఎయిడ్ సహకారంతో వరద ముంపు ప్రాంతాల్లో బాధిత కుటుంబాలకు నిత్యావసరాలతో పాటు దుప్పట్లు తదితర సామగ్రి పంపిణీ చేశామన్నారు. సర్పంచ్ అభిరామ్, వీఆర్‌ఓ ధర్మరాజు, జావీద్, యాక్షన్ ఎయిడ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రైలు పట్టాలపై గుర్తు తెలియని మృతదేహం



రైలు పట్టాలపై గుర్తు తెలియని మృతదేహాన్ని పరిశీలిస్తున్న తుని రైల్వే పోలీసులు

కోటవురట్ల: మండలంలోని బయ్యవరం వద్ద రైలు పట్టాలపై గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని గుర్తించినట్లు తుని రైల్వే ఎస్ఐ షేక్ అబ్దుల్ మారూఫ్ తెలిపారు. ఎస్ఐ వివరాల ప్రకారం... గుర్తు తెలియని రైలు ఢీకొనడంతో శరీరం తునాతునకలై అక్కడే మృతి చెందాడు. మృతుడి వద్ద ఎటువంటి ఆధారాలు లభించలేదు. మృతదేహానికి కొంతదూరంలో నీలి రంగుపై పసుపు రంగు గళ్ల లుంగి, లేత పసుపు రంగు గళ్ల టవల్ చిరిగి ఉన్నాయి. హవాయి చెప్పు ఒకటి దూరంలో పడి ఉంది. మృతదేహాన్ని తుని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. బంధువులు ఉంటే 9290619020, 9494887786 నంబర్లనుగాని, తమ పోలీసు స్టేషన్‌లోగాని సంప్రదించాలని పోలీసులు సూచించారు. మృతుడిది బయ్యవరం గ్రామంగా స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడి మృతి



మృతుడు భీముని సాయికిరణ్

యలమంచిలి: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన యువకుడు అనకాపల్లి ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం ఉదయం మృతి చెందాడు. రూరల్ ఎస్సై సన్నిబాబు వివరాల మేరకు... యలమంచిలి మున్సిపాలిటీ పరిధి కొక్కిరాపల్లికి చెందిన భీముని సాయికిరణ్(21) తన ద్విచక్ర వాహనంపై ఈ నెల 27న గురువారం రాత్రి 10 గంటల సమయంలో యలమంచిలి నుంచి స్వగ్రామానికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో గ్రామ సమీపంలో సిమెంట్ దిమ్మెను ఢీకొట్టాడు. దాంతో తీవ్రంగా గాయపడిన అతడికి యలమంచిలి ప్రభుత్వాస్పత్రిలో ప్రాథమిక వైద్యం అందించి, మెరుగైన వైద్య సేవల నిమిత్తం అనకాపల్లి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.